క్లుప్తంగా

పోలీసుల ఆకస్మిక తనిఖీ



ఆటో డ్రైవర్‌ను ప్రశ్నిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

గోదావరిఖని: స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పోలీసులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానిత వ్యక్తులను ప్రశ్నించి వదిలిపెట్టారు. వాహనాల కాగితాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లు, డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డితో పాటు ఎస్సైలు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలి



తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి

ధర్మారం: వ్యాపారులు, రైతులకు నాణ్యమైన ఎరువులు విక్రయించాలని, లేనిపక్షంలో ప్రభుత్వ పరంగా చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి బండ ప్రమోద్‌కుమార్ పేర్కొన్నారు. ధర్మారం మండల కేంద్రంతో పాటు మండలంలోని దొంగతుర్తిలోని ఎరువుల దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. అనుమతి లేని మందులను విక్రయించరాదన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అమ్ముకోవాలని సూచించారు. ఏఈవోలు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు షీటీం కృషిచేస్తుంది

ఎలిగేడు: మహిళల భద్రతకు షీటీం కృషి చేస్తుందని షీటీం ఇన్‌చార్జి ఏఎస్సై మలన్న అన్నారు. రామగుండం సీపీ ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రంలోని అభ్యుదయ మండల సమాఖ్య కార్యాలయంలో స్వశక్తి సంఘాల మహిళలకు షీటీంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మల్లన్న మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రతీరోజు బస్టాండు, ప్రధాన చౌరస్తాల్లో, జన సమీకరణ ప్రాంతాలు, కాలేజీల వద్ద షీటీం నిరంతరం నిఘా ఉంటుందన్నారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే 63039 23700 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఆపద సమయంలో డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. షీటీం సభ్యురాలు స్నేహలత, టీసెర్ప్ ఏపీఎం సుధాకర్, సీసీ ఆనంద్, వీవోఏలు, స్వశక్తిసంఘాల మహిళలు పాల్గొన్నారు.

నిరుపేద మహిళకు నిత్యావసరాలు

జ్యోతినగర్: నిరుపేద మహిళా కుటుంబానికి నిత్యావసర సరుకులు అందించి సేవా స్ఫూర్తి ఫౌండేషన్ తమ ఔదార్యం చాటుకుంది. రామగుండం కార్పొరేషన్ ఇందిరమ్మ కాలనీకి చెందిన గొర్ల విజయలక్ష్మి పూరి గుడిసె దగ్ధమైన విషయాన్ని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు మడిపల్లి మల్లేశ్ తెలుసుకున్నారు. ఆయన ఫౌండేషన్ సహకారంతో ఎన్టీపీసీ పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఆసిఫ్ పాషా చేతుల మీదుగా బుధవారం నిత్యావసర సరుకులు అందించారు. విజయలక్ష్మి కుటుంబ పరిస్థితులను ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి సహాయక చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించినట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు అబ్బాస్, సాయికుమార్, సురేశ్, కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా గీతా జయంతి



సుల్తానాబాద్‌లో భగవద్గీత పారాయణం

సుల్తానాబాద్: గీతా జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వికాస తరంగిణిశాఖ ఆధ్వర్యంలో స్థానిక శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో వేడుకలు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భగవద్గీత గ్రంథాలకు పూజలు చేసి గీత పారాయణం నిర్వహించారు. అనంతరం భక్తులకు పండ్ల పంపిణీ చేశారు. వికాస తరంగిణి పట్టణ అధ్యక్షుడు సాదుల సుగుణాకర్, ప్రతినిధులు పాల్గొన్నారు.

గాయత్రి విద్యానికేతన్‌లో..

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్‌లో గీతా జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీకృష్ణుని విగ్రహానికి విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్ పూలమాల వేశారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీల్లో ప్రతిభ చూపిన పూరెల్ల హన్విత (9వ తరగతి), కొమురవెల్లి కార్తీక్ (7వ తరగతి)కు ప్రశంస పత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు సృజన, శాంతలక్ష్మి, రాజమణిని సన్మానించారు.

సర్వే కంప్యూటరీకరణ పూర్తి

- వార్డుల తప్పిదాలను సరిచేస్తున్న కార్యదర్శులు



సర్వే ఆన్‌లైన్ చేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది (ఫైల్)

సుల్తానాబాద్: పట్టణంతోపాటు మండలంలో ముగిసిన సర్వే వివరాల ఆన్‌లైన్‌ను ఉద్యోగులు, సిబ్బంది కంప్యూటర్ ఆపరేటర్లు పూర్తి చేశారు. ఇంటింటా తిరిగి సేకరించిన డాటాను కంప్యూటర్ చేసే పని పూర్తి చేశారు. పట్టణంలో 6,089 ఇళ్లు ఉండగా మండలవ్యాప్తంగా 16,053 ఇళ్లు ఉన్నట్లు సర్వే చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. దరఖాస్తు ఫారాలను అన్ని పూర్తి చేసినట్లు ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఎంపీవో సమ్మిరెడ్డి, కమిషనర్ వెంకటేశ్, మేనేజర్ అలీమొద్దీన్ తెలిపారు.

సవరిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మండలంలోని 27 గ్రామపంచాయతీల్లో ఉన్న వార్డులను ఆన్‌లైన్ చేసేటప్పుడు ఉద్యోగులు సిబ్బంది, తప్పులు ఎంట్రీ చేయడంతో గణాంకాలలో తేడా రావడంతో అధికారులు వార్డుల భారీగా తప్పులు సరిచేసే పనిలో నిమగ్నమయ్యారు. పూర్తికాగానే ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నారు.

సర్వేకు సహకరించని వ్యాపారులు

కుటుంబ సమగ్ర సర్వేలో పట్టణంతోపాటు గ్రామాల్లోని వ్యాపారవేత్తలు, ఉన్నత ఉద్యోగులు సహకరించలేదని ఉద్యోగులు చెప్తున్నారు. ఆదాయం, ఆస్తులు, ట్యాక్స్ చెల్లించేవారు చెల్లిస్తున్నట్లు చెప్పలేదని అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వేల్లో సమాచారం ఇవ్వని వారిపై చర్యలు తీసుకుంటారా? చేపట్టిన సర్వేతోనే కొనసాగిస్తారా అనే విషయం తెలియాల్సి ఉంది.

ఆన్‌లైన్ పూర్తి చేశాం



ప్రభుత్వం విధించిన గడువు కంటే ముందుగానే సర్వే ఆన్‌లైన్ పూర్తి చేశాం. కంప్యూటర్ చేస్తున్న క్రమంలో కొన్ని తప్పులు జరిగిన వాటిని పంచాయతీ కార్యదర్శులు సరి చేస్తున్నారు. ఎడిట్ ఆప్షన్ రావాల్సి ఉంది. రాగానే అభ్యంతరాలు ఉన్న వారు చెప్తే సరిచేస్తాం.

– దివ్యదర్శన్‌రావు, ఎంపీడీవో, సుల్తానాబాద్



రామగిరి: మండలంలోని ఆదివారంపేటలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం బోర్డు మూలన పడింది. అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణంలో బోర్డు చేయాలని క్రీడాకారులు, ప్రజలు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

కార్మికులను నట్టేట ముంచిన టీబీజీకేఎస్



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: పదేళ్ల పాటు గుర్తింపు యూనియన్‌గా ఉన్న టీబీజీకేఎస్ కార్మికులను నట్టేట ముంచిందని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి విమర్శించారు. ఆర్జీ–2 ఏరియా వర్క్‌షాప్‌లో బుధవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం గుర్తింపు సంఘంగా గెలిచిన ఏఐటీయూసీ 10నెలల కాలంలో ఒక్క ఒప్పందం కూడా చేసుకోలేదని ఆరోపించారు. పైరవీలకే పరిమితమై యూనియన్ నడుపుతున్నారన్నారు. ఈ సందర్భంగా ఏరియా వర్క్‌షాప్ పిట్ సెక్రటరీగా వంగ సురేశ్‌ను ప్రకటించారు. అసిస్టెంట్ పిట్ సెక్రటరీగా నరసింహారెడ్డి, శ్యామ్‌గౌడ్‌తో 25మందిని నియమించారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షులు కొత్త సత్యనారాయణరెడ్డి, నాయకులు దశరథంగౌడ్, సంపత్‌రెడ్డి, కొంగర రవీందర్, బర్ల రవీందర్, బాలయ్య, అనుమ రాయమల్లు పాల్గొన్నారు.

సరైన రక్షణ పరికరాలు ఇవ్వకుండా వేధిస్తున్నారు



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: కార్మికులకు సరైన రక్షణ పరికరాలు ఇవ్వకుండా, పనిస్థలాల్లో సౌకర్యాలు కల్పించకుండా బొగ్గు ఉత్పత్తి సాధించాలని ఆర్జీ–2 ఏరియా సింగరేణి యజమాన్యం వేధిస్తోందని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ నాయకులు ధర్మపురి, అక్రమ్ ఆరోపించారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణి సంస్థలోని ప్రతీ సెక్షన్‌లో పనిచేస్తున్న కార్మికుల సమష్టి కృషితోనే సంస్థకు లాభాలు వస్తున్నాయన్నారు. ఐదు నిమిషాల ఆలస్యం పేరుతో గ్రీన్, ఎల్లో, రెడ్ కార్డులను జారీ చేస్తూ కార్మికులను భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా వారి జీతాల నుంచి డబ్బులు కట్ చేయడంపై మండిపడ్డారు. పాత దోజర్లతోనే పని చేయించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఆర్జీ–2 పీరియా సింగరేణి యజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఐఎన్‌టీయూసీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ కొత్త సత్యనారాయణరెడ్డి, దశరథంగౌడ్, రవీందర్, రాజయ్య, రవీందర్ పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడాపోటీలు

మంథని: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా బుధవారం మంథని క్రీడా మైదానంలో సీఎం కప్ పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించి క్రీడాకారులను ఎంపిక చేశారు. వైస్‌చైర్మన్ సీపతి బానయ్య, కౌన్సిలర్లు, హెచ్‌ఎంలు ఉన్నారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన సీఎం కప్ క్రీడాపోటీలను బుధవారం ఎంపీడీవో లలిత ప్రారంభించారు. ఎంపీవో భాస్కర్, పీఈటీ రేణుక, సావిత్రి పాల్గొన్నారు.

ఓదెల: మండలంలోని పొత్కపల్లిలో గురువారం సీఎం కప్ క్రీడలు ప్రారంభమయ్యాయి. ఎంఈవో ఎర్ర రమేశ్, పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, ఎంపీడీవో జీ.తిరుపతి పాల్గొన్నారు.

రామగిరి: సెంటినరికాలనీ జేఎన్టీయూ కళాశాలలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య క్రీడా ప్రాంగణంలో సీఎం కప్ మండలస్థాయి పోటీలు ప్రారంభమయ్యాయి. ఎంపీడీవో శైలజారాణి, ఎంపీవో ఉమేశ్, ఎంఈవో కొమురయ్య, జేఎన్టీయూ సూపరింటెండెంట్ గోపాల్‌రెడ్డి, పీడీ కృష్ణారెడ్డి, మెడికల్ ఆఫీసర్ ప్రదీప్, ఏఎస్‌ఐ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

పాలకుర్తి: మండలస్థాయి సీఎం కప్ ఆటల పోటీలు బుధవారం ముగిశాయి. విజేతలకు ఎంపీడీవో శశికళ బహుమతులు ప్రదానం చేశారు.

సంక్షిప్త వార్తలు

• 65కిలోల సింగరేణి కాపర్ వైర్ పట్టివేత

గోదావరిఖని: అక్రమంగా తరలిస్తున్న కాపర్ వైర్‌ను పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. ఆర్జీ–1 ఏరియాలోని జీడీకే–2వ గని నుంచి చోరీ చేసి తీసుకెళ్తున్నారన్న సమాచారం మేరకు ఆకస్మిక తనిఖీ నిర్వహించి ఆటోలో తరలిస్తున్న 65కిలోల కాపర్ వైర్ స్వాధీనం చేసుకున్నారు. అడ్డగుంటపల్లికి చెందిన దొంతుల శ్రీనివాస్, ముత్యాల ఐలయ్యను అదుపులోకి తీసుకొని కాపర్ తరలిస్తున్న ట్రాలీని, అందులో ఉన్న కాపర్ వైర్‌ను వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సెక్యూరిటీ అధికారి ఉమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

• బైక్‌ను ఢీకొన్న పంది.. దంపతులకు గాయాలు

రామగిరి: మండలంలోని నవాబ్‌పేట వద్ద పంది ఢీకొనడంతో దంపతులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాల్వశ్రీరాంపూర్ మండల కూనారం గ్రామానికి దాసి రాజేశం, రాజేశ్వరి దంపతులు బుధవారం సెంటినరికాలనీలోని తమ బంధువుల ఇంటికి వచ్చారు. స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా నాగెపల్లి–ముత్తారం ప్రధాన రహదారిలో నవాబ్‌పేట వద్ద పంది బైక్‌ను ఢీకొన్నంది. వారు కింద పడగా ఇద్దరికీ గాయాలు కాగా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

• వైద్యసేవల్లో శిక్షణ

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో పలు విభాగాల్లో కేజీబీవీ విద్యార్థులు శిక్షణ తీసుకుంటున్నట్లు ట్యూటర్ అపరంజి బుధవారం తెలిపారు. మండలంలోని భూపతిపూర్ కేజీబీవీలో ఫైనల్ ఇయర్ చదువుతున్న ఎంపీహెచ్‌ఏ ట్రైనింగ్ విద్యార్థులు శిక్షణ పొందుతున్నట్లు పేర్కొన్నారు.

• కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

పాలకుర్తి: మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 34మంది లబ్ధిదారులకు రూ.34లక్షల విలువ గల చెక్కులను తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీవో శశికళ అందజేశారు. రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలీఠాకూర్, మాజీ ఎంపీపీ రమేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

• రెండోరోజు కొనసాగిన ఎంఈవో కార్యాలయ సిబ్బంది సమ్మె

జూలపల్లి: ఎన్నో ఏళ్లుగా చాలీచాలని వేతనంతో పనిచేస్తున్న మండల విద్యాధికారి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని క్రమబద్ధీకరించాలని చేపట్టిన నిరవధిక సమ్మె రెండోరోజు కొనసాగింది. సమ్మెలో సీఆర్‌పీలు సతీశ్, తిరుమల, ఎంఐఎస్‌లు ప్రియాంక, మధు, నవ్య, ఏఎన్‌ఎం లక్ష్మి, ఓఎస్ మహేశ్వరి ఉన్నారు.

• ఆరోపణలు చేస్తే సహించేది లేదు

కమాన్‌పూర్: పదవులకు ఆశపడి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుపై కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేస్తే సహించేది లేదని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మంథని నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని వారు ప్రశ్నించారు. సమావేశంలో మేకల సంపత్, బొమ్మగాని అనిల్, కొండ వెంకటేశ్, బోనాల వెంకటస్వామి, గుర్రం లక్ష్మిమల్లు, నీలం శ్రీనివాస్ పాల్గొన్నారు.

• కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

సుల్తానాబాద్: రాష్ట్ర సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర నాయకులు సట్టు కనుకయ్య, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కర్రు సురేశ్ పలువురు హెచ్‌ఎంలు సంఘీభావం ప్రకటించారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఎస్‌ఎస్‌ఏ నిరసన సమ్మె చేశారు. సంఘం నాయకులు సట్టు కనకయ్య ప్రధానోపాధ్యాయులు సందర్శించి వారికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

• రెండోరోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

కాల్వశ్రీరాంపూర్: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం రెండోరోజుకు చేరింది. తమ డిమాండ్లపై సర్కార్ నిర్లక్ష్యం వహిస్తోందని వారు ఆవేదన చెందారు.

సింగరేణి దినోత్సవం ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జీఎంలు ఎన్.సుధాకర్‌రావు, కె.వెంకటేశ్వర్లు

రామగిరి: సింగరేణి దినోత్సవం ఘనంగా నిర్వహించాలని ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు నరేంద్ర సుధాకర్‌రావు, కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో సంబంధిత గనులు, వివిధ విభాగాల అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సెంటినరికాలనీ రాణిరుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో చేయాల్సిన ఏర్పాట్లపై ఆయా గనుల అధికారులతో సమావేశం నిర్వహించి పలు సలహాలు, సూచనలు చేశారు. వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్రారెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, ఎస్‌వోటూ జీఎంలు జి.రఘుపతి, బి.సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర్‌బాబు, అధికారులు సుదర్శనం, రాజేంద్రకుమార్, కాశీ విశ్వేశ్వర్‌రావు, ఐలయ్య, షబ్బీరుద్దీన్, రాజారెడ్డి, గుర్రం శ్రీహరి, రాజేశ్వరి పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

రామగిరి: సింగరేణి సంస్థలో బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్లుగా విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులు వారి కోసం గుర్తించిన హోదాల్లో పనిచేస్తూ పదోన్నతి పొందేందుకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ–3 ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి అన్నారు. ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లోని వివిధ విభాగాల్లో బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్‌లుగా విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులకు సంబంధిత కమిటీ ఆధ్వర్యంలో జీఎం కార్యాలయంలో బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. సర్ఫేస్‌లో పనిచేసేందుకు వీలుగా ఉన్న 16 రకాల పోస్టుల గురించి తెలియజేసి, ఆ హోదాలలో ఉండే పనివిధానం వివరించారు. కౌన్సిలింగ్‌కు 16 మంది మహిళా బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్ ఉద్యోగులు హాజరయ్యారు. ఐఈడీ డీజీఎం చంద్రశేఖర్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, మెడికల్ సూపరింటెండెంట్ కృపానంద్ భాస్కర్ పాల్గొన్నారు.

మద్దెల దినేశ్‌కు జాతీయ అవార్డు

కోల్‌సిటీ: గోదావరిఖనికి చెందిన ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు, డీహెచ్‌ఎస్ నాయకుడు మద్దెల దినేశ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డు–2024కు ఎంపికయ్యారు. అవార్డు సెలెక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్, బీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ఆహ్వాన పత్రాన్ని హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో బుధవారం దినేశ్‌కు అందజేశారు. డిసెంబర్ 15న న్యూఢిల్లీలో జరిగే బహుజన సాహిత్య అకాడమీ 5వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో దినేశ్‌కు అవార్డు అందజేయనున్నట్లు తెలిపారు.

ఈత పోటీల్లో విజేతలు వీరే



గెలుపొందిన విజేతలు

రామగిరి: కంపెనీ స్థాయి ఈతపోటీలు బుధవారం సెంటినరికాలనీ రాణిరుద్రమదేవి క్రీడాప్రాంగణంలోని ఈతకొలనులో నిర్వహించారు. ఈ పోటీల్లో ఫ్రీస్టైల్‌లో ఏపీఏ ఏరియాకు చెందిన ప్రదీప్‌కుమార్, బ్యాక్ స్ట్రోక్‌లో ఏపీఏ ఏరియాకు చెందిన తుమ్మల సాయినాథ్, బ్రేక్ స్ట్రోక్‌లో భూపాల్‌పల్లి ఏరియాకు చెందిన నాగుల అఖిల్, బటర్ ఫ్లైలో భూపాల్‌పల్లికి చెందిన తాళ్ల నరేశ్ ప్రథమ స్థానంలో నిలిచి విజేతలుగా నిలిచారు. వీరికి ఆర్జీ–3 జీఎం ఎన్.సుధాకర్‌రావు బహుమతులు ప్రదానం చేశారు.

సింగరేణి వార్తలు

సమష్టి నిర్ణయాలతో సత్ఫలితాలు



రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

గోదావరిఖని: సమష్టి నిర్ణయాలతో సత్ఫలితాలు సాధించవచ్చని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. జీడీకే–2, 2ఏ గనిపై బుధవారం నిర్వహించిన మల్టీడిపార్ట్‌మెంట్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంస్థ పురోభివృద్ధికి సాధించాల్సిన అంశాలపై ప్రతీఒక్కరు దృష్టిసారించాలన్నారు. సంస్థ అభివృద్ధి కోసం సూచనలు, సలహాలు అందజేయాలని సూచించారు. సంస్థపై అంకితభావం, సమష్టికృషితో ఉత్పత్తి, ఉత్పాదకత పెంచేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. యూనియన్ నాయకులు అరెల్లి పోషం, అధికారులు డీవీరావు, ఆంజనేయులు, కిరణ్‌బాబు, రమేశ్‌బాబు, అల్లావుద్దీన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కోలిండియా స్థాయిలో కీర్తి పతాకం ఎగురవేయాలి



బహుమతి అందిస్తున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి: సింగరేణి సంస్థ క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, క్రీడాస్ఫూర్తితో కోల్ ఇండియా స్థాయిలో సింగరేణి కీర్తి పతాకం ఎగురవేయాలని ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావు అన్నారు. సెంటినరికాలనీ రాణిరుద్రమ దేవి క్రీడా ప్రాంగణంలో ఆర్జీ–3, ఏపీఏ వర్క్‌పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా పోటీలు నిర్వహిస్తున్నారు. బుధవారం కంపెనీ స్థాయి అథ్లెటిక్స్, స్విమ్మింగ్, త్రోబాల్ పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొని విజేలతకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం జీఎం మాట్లాడుతూ కోలిండియా స్థాయి పోటీల్లో రాణించి సంస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పోటీల్లో సుమారు 300 మంది క్రీడాకారులు 49 విభాగాల్లో పాల్గొన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్రారెడ్డి, ఎస్.శ్రీనివాసరావు, అధికారుల సంఘం అధ్యక్షుడు సీ.హెచ్.వెంకటరమణ, ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, అధికారులు షబ్బీరుద్దీన్, గుర్రం శ్రీహరి, గౌరవ కార్యదర్శి సునీల్ ప్రసాద్, అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ జాన్ వెస్లీ, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలి



మాట్లాడుతున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి: సింగరేణి ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ, అంకితభావంతో విధులు నిర్వహించాలని ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావు అన్నారు. సింగరేణివ్యాప్తంగా నిర్వహిస్తున్న మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశాల్లో భాగంగా బుధవారం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశం నిర్వహించారు. సంస్థ స్థితిగతులతో పాటు, ఏరియా ఆర్థిక పరిస్థితులపై అవగాహన కల్పించారు. జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థలో ఉద్యోగుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధికి సంబంధించి ఉద్యోగుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్రారెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర్‌బాబు, ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, అధికారులు బి.సుదర్శనం, రాజేంద్రకుమార్, రాజారెడ్డి, బి.వి.సత్యనారాయణ, నాగేశ్వరరావు, ఐలయ్య, గుర్రం శ్రీహరి, రాజేశ్వరి పాల్గొన్నారు.

చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదానికి దారితీస్తుంది

గోదావరిఖని: చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదానికి దారితీస్తుందని ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య అన్నారు. స్థానిక వకీల్‌పల్లిగనిలో జరిగిన 55వ రక్షణ వారోత్సవాలకు బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్షణపై అవగాహనతో ముందుకు సాగుతూ సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. పనిలో కొంత ఆలస్యమైనా సరే రక్షణ విషయంలో నిర్లక్ష్యంగా ఉండొద్దని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేట్ సేఫ్టీ కమిటీ కన్వీనర్, జీఎం హబీబ్ హుస్సేన్, అధికారులు కనకయ్య, చంద్రశేఖర్, దేశాయ్, రహమత్ అలీ, సత్యనారాయణ, అమర్‌నాథ్, ప్రాజెక్టు అధికారి నెహ్రూ, ఏరియా ఇంజనీర్ నర్సింహారావు, ఎస్‌వోటూ జీఎం రాముడు, డాక్టర్ పద్మ, ఏరియా రక్షణ అధికారి సంతోష్‌కుమార్, గని రక్షణ అధికారి రాంకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ

పాలకుర్తి: బసంత్‌నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం గోదావరిఖనికి చెందిన ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంఘం ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్లు రమేశ్, మేజిక్‌రాజా, దేవీ లక్ష్మీనర్సయ్య పదో తరగతి విద్యార్థులకు టైం మేనేజ్‌మెంట్, అంతర్గత శక్తి సామర్థ్యాల పెంపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

నేత్ర, అవయవ, శరీరదానాలపై అవగాహన

ఓదెల: నేత్ర, అవయవ, శరీరదానాలపై సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి అవగాహన కల్పించారు. ఓదెలలో నేత్రదాత క్యాతం లక్ష్మి సంస్మరణ సభ గురువారం జరిగింది.

మచ్చుపేటలో పశువైద్య శిబిరం

ముత్తారం: మండలంలోని మచ్చుపేటలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం పశువులకు టీకా వేశారు.